ప్రజాశక్తి
మంగళవారం 26 నవంబరు 2024
5
శ్రీకాకుళం



నేడు కలెక్టరేట్ వద్ద రైతు, కార్మిక ధర్నా

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, రైతాంగ వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఆల్ ట్రేడ్ యూనియన్స్, సంయుక్త కిసాన్ మోర్చా ఆధ్వర్యాన కలెక్టరేట్ వద్ద మంగళవారం ధర్నా చేపడుతున్నారు. ధర్నాను జయప్రదం చేయాలని కోరుతూ ఇప్పటికే పలురూపాల్లో కార్మిక, రైతు సంఘాలు విస్తృత ప్రచారం చేశాయి. పలు ప్రాంతాల్లో కార్మికులు, రైతులు బైక్ ర్యాలీలు నిర్వహించారు. గ్రామాల్లో కరపత్రాలను పంపిణీ చేసి ప్రజలకు అవగాహన కల్పించారు. కనీస వేతనం రూ.26 వేల చెల్లింపు, నాలుగు లేబర్ కోడ్‌లు రద్దు, స్వామినాథన్ కమిషన్ సిఫార్సుల అమలు, జీడికి మద్దతు ధర, ఉపాధి హామీ చట్టం ద్వారా 200 రోజుల పనిదినాలు, రోజుకు రూ.600 వేతనం తదితర డిమాండ్లతో ధర్నాకు సిద్ధమవుతున్నారు.



లావేరు : పొలాల్లో కోసి ఉన్న వరి ఓవులు

వాయు'గండం'

- జిల్లాలో పలుచోట్ల ప్రారంభమైన వరి కోతలు
- 28, 29 తేదీల్లో వర్షాలు కురుస్తాయంటూ వాతావరణశాఖ హెచ్చరిక
- ఆందోళనలో అన్నదాతలు

దక్షిణ బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం అన్నదాతలను ఆందోళనకు గురిచేస్తోంది. ఈనెల 28, 29 తేదీల్లో వర్షాలు కురుస్తాయంటూ వాతావరణశాఖ హెచ్చరికలు జారీ చేసింది. సోమవారం వాతావరణంలో స్వల్ప మార్పులు కనబడడం రైతులను కలవరానికి గురిచేసింది. మరోవైపు చలిగాలుల తీవ్రత బాగా పెరిగింది. చాలాచోట్ల వరి కోతలు పూర్తయ్యాయి. కొన్నిచోట్ల పంట కోసి కుప్పలుగా పోశారు. జిల్లాలో ముమ్మరంగా నూర్పులు జరుగుతున్నాయి. వర్షాలు కురుస్తాయన్న వార్తల నేపథ్యంలో పంటను కాపాడుకునే పనిలో అన్నదాతలు నిమగ్నమయ్యారు. పొలాల్లో ఎండబెట్టడం కోసం ఉంచిన ధాన్యాన్ని ఇళ్లకు తరలిస్తున్నారు.

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

జిల్లాలో ఈ ఏడాది 3,59,495 ఎకరాల్లో వరి పంట సాగు అయింది. ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో 4.90 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. అందుకనుగుణంగా జిల్లావ్యాప్తంగా 403 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారు. జిల్లాలో పలు మండలాల్లో ధాన్యం అమ్మేందుకు రైతులు సిద్ధంగా ఉన్నా, కొనుగోలుకు అవసరమైన ఏర్పాట్లు పూర్తిస్థాయిలో చేయలేదు. ఈనెల 17వ తేదీ నుంచే ధాన్యం కొనుగోలు చేస్తామని అధికారులు ప్రకటించినా 23న మొదలుపెట్టారు. ఇప్పటివరకు ఏడు కేంద్రాలను ఏర్పాటు చేసి, 68 మెట్రిక్ టన్నులు మాత్రమే కొనుగోలు చేశారు. జలుమూరు, సారవకోట, పోలాకి మండలాల్లో ఏడు కేంద్రాల ద్వారా కొనుగోలు చేశారు. నరసన్నపేట, సరుబుజ్జిలి, ఎల్ఎన్‌పేట, కొత్తూరు తదితర మండలాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలు సిద్ధంగా ఉన్నట్లు అధికారులు చెప్తున్నారు. మరికొన్ని మండలాల్లో రైతులు కోతలకు సిద్ధమవుతున్నారు. వాతావరణంలో మార్పులతో కొన్నిచోట్ల కోతలకు వెనుకాడుతున్నారు. కోతలు పూర్తయిన చోట పొలాల్లోనే కుప్పలు వేసి ఉంచారు. సరిగ్గా ఈ దశలో వర్షాలు పడతాయన్న వార్తలతో రైతుల్లో గుబులురేపుతోంది. ఈ దశలో ఏ మాత్రం వర్షం కురిసినా ధాన్యంతో పాటు పొలాల్లోని పంటలకూ నష్టం తప్పదని అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు.



రణస్థలంలో వరి కుప్పలు పెడుతున్న రైతులు



లావేరు : కళ్లాలకు ట్రాక్టర్‌పై తరలిస్తున్న రైతులు

సామాజిక అంతరాలను తగ్గించేది విద్య

- నైతిక విలువల బలహీనతకు ప్రైవేటీకరణే కారణం
- పోరాటాలతోనే హక్కుల సాధన
- యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఎన్.వెంకటేశ్వర్లు
- ముగిసిన యుటిఎఫ్ జిల్లా స్వర్ణోత్సవ మహాసభలు
- ఏకగ్రీవంగా నూతన కార్యవర్గం ఎన్నిక



మాట్లాడుతున్న యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు వెంకటేశ్వర్లు

ప్రజాశక్తి - మందస, పలాస

సమాజంలో పలురకాల రుగ్మతలను తగ్గించి, సామాజిక అంతరాలు రూపుమాపి, సమానత్వ ఆలోచనను పెంపొందించే లక్షణం విద్యకు మాత్రమే ఉందని, అలాంటి విద్య ప్రభుత్వ రంగంలో ఉండాలని యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఎన్.వెంకటేశ్వర్లు అన్నారు. మందస మండలం హరిపురంలోని జెడ్‌పి ఉన్నత పాఠశాల ఆవరణలో రెండు రోజుల పాటు నిర్వహించిన యుటిఎఫ్ జిల్లా స్వర్ణోత్సవ మహాసభలు సోమవారం ముగిశాయి. ప్రతినిధుల సభలో ఆయన మాట్లాడుతూ సమాజంలో నైతిక విలువలు బలహీనంగా ఉండడానికి కారణం విద్య సగభాగం ప్రైవేటీకరణ కావడమేనని చెప్పారు. విద్య ద్వారా సమాజానికి మానవత్వం కలిగిన నూతన తరం తయారు కావాలని ఆకాంక్షించారు. విద్యార్థులకు నైతిక విలువలు.. సమాజం, కుటుంబంపై బాధ్యత నేర్పాల్సిన బాధ్యత ఉపాధ్యాయులు తీసుకోవాలని కోరారు. ఉపాధ్యాయ సంఘాల్లో ఉపాధ్యాయ ఉద్యమ చరిత్రలో యుటిఎఫ్‌కు ప్రత్యేక స్థానం ఉందన్నారు. ఉపాధ్యాయుల సంక్షేమం, విద్యారంగ వికాసం లక్ష్యాలుగా యుటిఎఫ్ పనిచేస్తోందని తెలిపారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసమే కాకుండా ప్రజలకు ఇబ్బంది వచ్చిన ప్రతి సందర్భంలోనూ వారిని ఆదుకోవడానికి యుటిఎఫ్ కార్యకర్తలు పనిచేశారని, ఇలాంటి సామాజిక స్పృహ యుటిఎఫ్ వంటి సంఘంలో మాత్రమే ఉంటుందన్నారు. హక్కుల సాధనకు ప్రతి ఉపాధ్యాయుడు పోరుబాటకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు.

యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.కిషోర్ కుమార్ మాట్లాడుతూ ప్రాథమిక పాఠశాల వ్యవస్థని బలోపేతం చేసే విధంగా ప్రభుత్వ విధానాలు ఉండాలన్నారు. ప్రభుత్వ విద్యను బతికించుకోవడం కోసం ఉపాధ్యాయులు, ప్రజలతో కలిసి మా ఊరి బడి మా ఊరిలోనే ఉండాలనే నినాదంతో పనిచేయాలన్నారు. యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.మురళీ మోహన్ మాట్లాడుతూ జిఒ నంబరు 3 పునరుద్ధరణకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు లండ బాబూరావు అధ్యక్షతన నిర్వహించిన సభలో జిల్లా ప్రధాన కార్యదర్శి బి.శ్రీరామ్మూర్తి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు చౌదరి రవీంద్ర, ఆఫీస్ బేరర్స్ కె.వైకుంఠరావు, కె.దాలయ్య, బి.ధనలక్ష్మి, బి.రవికుమార్, జి.కోదండరావు, ఎల్.వి చలం, జి.శారద, ఎస్.స్వర్ణకుమారి, ఎం.వాగ్దేవి తదితరులు పాల్గొన్నారు.

తీర్మానాలు

- ఉపాధ్యాయ ఏకీకృత సేవా నిబంధనలు (కామన్ సర్వీస్ రూల్స్) సమస్యకు పరిష్కార మార్గం చూపి ఉద్యోగోన్నతులకు మార్గం సుగమం చేయాలి.
- ఉపాధ్యాయ, ఉద్యోగులకు తక్షణమే 30 శాతం ఐఆర్ ప్రకటించాలి. ఆర్థిక బకాయిలు విడుదల చేయాలి.
- పాత పెన్షన్ పథకం (ఒపిఎస్)ను పునరుద్ధరించాలి
- ప్రాథమిక పాఠశాలల మూసివేతను నిలుపుదల చేసి, ప్రభుత్వ విద్యారంగాన్ని పరిరక్షించాలి.
- 2024 డిఎస్‌సి నోటిఫికేషన్ తక్షణమే విడుదల చేయాలి.
- ప్లస్ 2 ఉన్నత పాఠశాలల్లో పనిచేస్తున్న పిజిటిలను రెగ్యులర్ పోస్టులుగా పరిగణించాలి.
- జూనియర్ లెక్చరర్ల ఉద్యోగోన్నతులు కల్పించాలి.



పాల్గొన్న ఉపాధ్యాయుల్లో ఒక భాగం

ఏకగ్రీవంగా నూతన కార్యవర్గం ఎన్నిక



ఎల్.బాబూరావు



బి.శ్రీరామ్మూర్తి

మహాసభల్లో యుటిఎఫ్ జిల్లా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా లండ బాబూరావు, ప్రధాన కార్యదర్శిగా బమ్మిడి శ్రీరామ్మూర్తి, గౌరవాధ్యక్షులు కె.వైకుంఠరావు ఎన్నికయ్యారు. కోశాధికారిగా బి.రవికుమార్, సహాధ్యక్షులుగా కె.దాలయ్య, బి.ధనలక్ష్మి, జిల్లా కార్యదర్శులుగా పి.సూర్యప్రకాశరావు, జి.సురేష్, హెచ్.అన్నాజీరావు, వై.వాసుదేవరావు, జి.నారాయణరావు, టి.వి.బి భాస్కరరావు, ఎం.వెంకటరమణ, కంచరాన రమేష్, జి.మాధవరావు, జి.శ్రీరామచంద్రమూర్తి, ఎం.మురళీప్రకాష్, జి.రమేష్, బి.శంకర్, బి.శ్రీను, జి.శారద, ఎస్.స్వర్ణకుమారి ఎన్నుకున్నారు. రాష్ట్ర కౌన్సిలర్లుగా సిహెచ్.రవీంద్ర, పి.అప్పారావు, జి.కోదండరావు, వై.ఉమాశంకర్, ఆర్.దమయంతి, బి.చిట్టిబాబు, ఎస్.నారాయణరావు, డి.ప్రకాష్, ఎం.వాగ్దేవి, రాష్ట్ర కార్యదర్శిగా ఎస్.కిషోర్ కుమార్‌ను ఎన్నుకున్నారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యులుగా బి.శ్రీరామ్మూర్తి, ఎల్.బాబూరావు, సిహెచ్.రవీంద్ర, ఆర్.దమయంతి, ఆడిట్ కమిటీ కన్వీనర్‌గా బి.గౌరీశ్వరరావు, సభ్యులుగా పి.బాబూరావు, సుదర్శన బెహరా, డి.గణపతిరావు, ఎస్.జయరాం, పి.ఉమామహేశ్వరరావు, ఎస్.జయరాం పి.ఉమాభాస్కర్ ఎన్నికయ్యారు.

మహిళలపై హింసకు పాల్పడితే చర్యలు

ప్రజాశక్తి - శ్రీకాకుళం

మహిళలపై హింసకు పాల్పడితే చర్యలు తీసుకుంటామని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ చెప్పారు. అంతర్జాతీయ స్త్రీ హింస నిరోధక దినోత్సవం సందర్భంగా జిల్లాపరిషత్ కార్యాలయం నుంచి సంతోషిమాత ఆలయం వరకు నిర్వహించిన ర్యాలీని జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్‌తో కలిసి సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంతర్జాతీయ స్త్రీ హింస నిరోధక కార్యక్రమాలు నెల రోజుల పాటు నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంపై మహిళల్లో అవగాహన కల్పిస్తామన్నారు. వైద్యారోగ్య, మహిళా స్త్రీ శిశు సంక్షేమశాఖ, డిఆర్‌డిఎ శాఖల సమన్వయంతో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మహిళలకు సంబంధించి న్యాయ కేంద్రాలు ఉన్నాయని, మహిళా స్త్రీ శిశు సంక్షేమ శాఖ నుంచి జిజిహెచ్‌లో వన్ స్టాప్ సెంటర్ ఉందన్నారు. మహిళలకు సంబంధించి కుటుంబ సమస్యలు ఉంటే న్యాయ సహాయం కోసం వన్ స్టాప్ సెంటర్‌ను సద్వినియోగం చేసుకోవాలన్నారు. వన్ స్టాప్ సెంటర్లు మహిళల కోసం ప్రతిచోటా ఉన్నట్లు చెప్పారు. ఇవే కాకుండా కౌన్సిలర్లనూ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మండలాల వారీగా, సిడిపిఒ వారీగా మహిళలకు న్యాయ సహాయం అందించనున్నట్లు చెప్పారు. ప్రతి పిహెచ్‌సి, సిహెచ్‌సిలో కౌన్సిలర్లు ఉంటారన్నారు. ఈ ర్యాలీ ద్వారా వైద్యారోగ్య, మహిళా స్త్రీ శిశు సంక్షేమం, డిఆర్‌డిఎతో పాటు సచివాలయ సిబ్బంది మహిళల్లో అవగాహన కల్పిస్తామన్నారు. ఎక్కడైనా మహిళలపై గృహ హింస, పనిచేసే స్థలాల్లో హింస జరిగితే స్థానిక, ఇంటర్ డిపార్ట్మెంట్, కలెక్టరేట్‌లో కమిటీలు ఉంటాయని, ఫిర్యాదు చేస్తే విచారణ చేసి చర్యలు తీసుకుంటామని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి బి.మీనాక్షి, వెనుకబడిన తరగతుల సంక్షేమశాఖ జిల్లా అధికారి అనురాధ, ఐసిడిఎస్ పీడీ బి.శాంతిశ్రీ, డిఆర్‌డిఎ పీడీ కిరణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

దగ్ధమైన వలలకు నష్ట పరిహారం

'మీకోసం'లో మత్స్యకారుల వినతి

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

ఎచ్చెర్ల మండలం డి.మత్స్యలేశం, కొత్తదిబ్బలపాలెం ప్రాంతాల్లో దగ్ధమైన వలలకు నష్ట పరిహారం అందించాలని పలువురు మత్స్యకారులు కోరారు. జిల్లాపరిషత్‌లో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ (మీకోసం)లో కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ఇతర అధికారులు కలిసి స్వీకరించిన వినతుల కార్యక్రమంలో వారు వినతిపత్రం అందించారు. డి.మత్స్యలేశం అక్టోబర్ 21న రాత్రి సమయంలో సముద్రపు ఒడ్డున ఉన్న వలలు, పనిముట్లు మంటల్లో కాలిపోయాయన్నారు. కొత్తదిబ్బలపాలెంలో ఈనెల 19న పలువురు మత్స్యకారులకు చెందిన వలలు కాలిపోయాయన్నారు. కాలిపోయిన వలలకు నష్టపరిహారం ఇచ్చి ఆదుకోవాలని కోరారు. వెనుకబడిన తరగతులకు సమన్యాయంతో పాటు సామాజిక న్యాయం దక్కాలంటే సమగ్ర కుల గణన చేయాలని ఆంధ్రప్రదేశ్ బిసి సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు కొమ్ము రమణమూర్తి, నాయకులు కె.శ్యామసుందర్, ఎ.కృష్ణారావు తదిరులు వినతిపత్రం అందించారు. బిసిల అభ్యున్నతికి కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక ఒడిసి మంత్రిత్వశాఖ ఏర్పాటు చేసి, ఒబిసి సబ్ ప్లాన్ ద్వారా బడ్జెట్ కేటాయింపులు చేయాలని విజ్ఞప్తి చేశారు. జనగణనతో పాటు కులగణన కూడా చేపట్టాలని కోరారు.



వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

రుప్ప వీధిలో స్థలం ఆక్రమణ

శ్రీకాకుళం నగరంలోని స్థానిక రుప్ప వీధిలో సర్వే నంబరు 100లో ఉన్న స్థలాన్ని తమ పూర్వీకుల నుంచి పశువుల శాలలు, ఇతర అవసరాలకు వినియోగించేవాళ్లమని, కొంతకాలంగా తమ బంధువైన రుప్ప రాంబాయి అనే మహిళతో పాటు మరికొందరు స్థలాన్ని ఆక్రమించుకునేందుకు ప్రయత్నిస్తున్నారంటూ రుప్ప వీధికి చెందిన రుప్ప లక్ష్మణరావు జెసికి ఫిర్యాదు చేశారు. ప్రస్తుతం మిగిలి ఉన్న స్థలంలోనూ ప్రహరీ నిర్మించి ఆక్రమణకు ప్రయత్నిస్తుండగా తాము అడ్డుకున్నామని చెప్పారు. పోలీసులతో భయంపెట్టించాలని చూస్తున్నారని చెప్పారు. తమ ప్రాంతంలో అంగన్‌వాడీ కేంద్రం అద్దె భవనంలో ఉన్నందున కేంద్రం నిర్మాణానికి, ఇరుకుగా ఉన్న రోడ్డును విస్తరించడానికి స్థలాన్ని ఉపయోగించడం వంటి ప్రజల అవసరాలకు వినియోగించాలని కోరారు. దీనిపై జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ అధికారులతో మాట్లాడి స్థలాన్ని సర్వే చేసి నివేదిక ఇవ్వాలని ఆదేశించారు.

ఉద్యోగాల పేరుతో మోసం

ప్రభుత్వ ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ నమ్మించి మోసం చేసిన మందస మండలం లోహరిబంద పంచాయతీ కార్యదర్శి మన్నం సతీష్‌బాబుపై చర్యలు తీసుకోవాలని పలువురు బాధితులు కలెక్టర్‌కు వినతిపత్రం అందించారు. ట్రెజరీ డిపార్ట్‌మెంట్‌లో ఖాళీగా ఉద్యోగాలు న్నాయంటూ మమ్మల్ని నమ్మించి ఒక్కొక్కరి దగ్గర నుంచి రూ.8 లక్షల నుంచి రూ.10 లక్షల వరకు వసూలు చేశారని చెప్పారు. సతీష్‌బాబు ఫోన్‌పే నంబరుకే తాము నగదు పంపామని, ఆధారాలు ఉన్నా అధికారులు, పోలీసులు చర్యలు తీసుకోవడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. మోసం చేసిన సతీష్‌బాబుపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవడంతో పాటు తమ సొమ్ములను మాకు వాపస్ చేసేలా చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

ప్రభుత్వ స్థలం ఆక్రమణ

శ్రీకాకుళం మండలం భైరిలో కరజాడకు చెందిన కొందరు వ్యక్తులు ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించుకోవాలని చూస్తున్నారని భైరికి చెందిన సిహెచ్.భారతి ఫిర్యాదు చేశారు. టెక్కలి మండలం లింగాలవలసలో తమ సాగులో భూమి అంశం జాతీయ ఎస్‌టి కమిషన్ వద్ద పెండింగ్‌లో ఉండగా భూ యజమాని తమకు కోర్టు ద్వారా నోటీసులు ఇప్పించి భయభ్రాంతులకు గురిచేస్తున్నారని ఫిర్యాదు చేశారు.

'మీకోసం'కు 65 వినతులు

మీకోసంలో పలురకాల సమస్యలపై 65 వినతులు వచ్చాయి. అర్జీల పరిష్కారానికి తక్షణం చర్యలు తీసుకోవాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదేశించారు. అర్జీల స్వీకరణలో జెసి ఫర్మాన్ అహ్మద్‌ఖాన్, డిఆర్ఒ ఎం.వెంకటేశ్వరరావు, జెడ్‌పి సిఇఒ ఎల్.వి.ఎన్ శ్రీధర్‌రాజా, డిఆర్‌డిఎ పీడీ కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్‌లో ఉత్తమ ఫలితాలే లక్ష్యం

కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

ప్రజాశక్తి - శ్రీకాకుళం

ప్రభుత్వ జూనియర్ కళాశాలల విద్యార్థుల ఉత్తీర్ణతా శాతం పెరిగేలా బోధన సాగాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆయా కళాశాలల ప్రిన్సిపాల్స్‌ను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ప్రభుత్వ జూనియర్ కళాశాలల ప్రిన్సిపాల్స్‌తో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. చదువులో వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించాలన్నారు. విద్యా ప్రమాణాలు పెంచేందుకు కృషి చేయాలని సూచించారు. ఈ విద్యా సంవత్సర వార్షిక ఫలితాల్లో ఉత్తమ ఫలితాల సాధనే లక్ష్యంగా ప్రతిఒక్కరూ కృషి చేయాలన్నారు. నిర్ణీత గడువులోగా సిలబస్‌ను పూర్తి చేసి విద్యార్థులను పరీక్షలకు సన్నద్ధం చేయాలన్నారు. చదువుతో పాటు విద్యార్థుల నడవడికపైనా అధ్యాపకులు దృష్టిసారించాలని సూచించారు.

చెడు వ్యసనాల బారిన పడకుండా, వ్యక్తిత్వ వికాసం పెంపొందేలా విద్యార్థులకు శిక్షణ ఇవ్వాలన్నారు. ఆ బాధ్యత అధ్యాపకులపై ఉందన్నారు. ప్రభుత్వ కళాశాలల్లో ఉత్తీర్ణతా శాతం పెరిగితే అడ్మిషన్ల సంఖ్య కూడా పెరిగే అవకాశం ఉంటుందని చెప్పారు. విద్యార్థులు కళాశాలలకు చేరుకునేందుకు ఆర్‌టిసి మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పించాలని సూచించారు. కళాశాలల్లో మధ్యాహ్న భోజనం, మంచినీరు, పారిశుధ్యం, మరుగుదొడ్లు తదితర అంశాల గురించి అడిగి తెలుసుకున్నారు. సమావేశంలో ప్రభుత్వ జూనియర్ కళాశాలల ప్రిన్సిపాల్స్, ఆర్ఐఒ పి.దుర్గారావు, డివిఇఒ ఎస్.తవిటినాయుడు, ఆర్‌టిసి డిఎం శర్మ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా జడ్జి జునైద్ అహ్మద్ మౌలానా

కిడ్నీ వ్యాధిగ్రస్తులకు అండగా నిలవండి

జిల్లా జడ్జి జునైద్ అహ్మద్ మౌలానా

ప్రజాశక్తి - శ్రీకాకుళం

ఉద్దానం ప్రాంతంలో పెరుగుతున్న కిడ్నీ బాధితులకు అండగా నిలవాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి జునైద్ అహ్మద్ మౌలానా అధికారులను ఆదేశించారు. జిల్లా కోర్టులోని సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కిడ్నీ వ్యాధిగ్రస్తులను నిరంతరం పర్యవేక్షించి, వారి ఆరోగ్యం కుదుటపడేలా చేయాలన్నారు. ఉద్దానం కమిటీలో గల వైద్యులు, నెఫ్రాలజిస్టులు, సైకాలజిస్టులు, ఫ్యాక్టరీస్ డిపార్ట్మెంట్, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు ప్రత్యేకంగా దృష్టిసారించాలని సూచించారు. సమావేశంలో నాలుగో అదనపు జిల్లా జడ్జి ఎస్.ఎం ఫణికుమార్, న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి ఆర్.సన్యాసినాయుడు, వైద్య, ఫ్యాక్టరీస్, రెవెన్యూ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఉద్యోగాల కల్పనకు కృషి

మంత్రి అచ్చెన్నాయుడు

ప్రజాశక్తి - కోటబొమ్మాళి

రాష్ట్రంలో ఉద్యోగాల్లేక చాలామంది నిరుద్యోగులు ఉన్నారని వారికి ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగాలతో పాటు స్వయం ఉపాధి అందించేందుకు చర్యలు చేపడతామని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. మండలంలోని నిమ్మాడ తన క్యాంపు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా దర్బారులో నిరుద్యోగులతో పాటు టెక్కలి, సంతబొమ్మాళి, నందిగాం, కోటబొమ్మాళి మండలాల నుంచి వచ్చిన ప్రజలు నుంచి ఆయన వినతులు స్వీకరించి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసిపి పాలనలో ఉద్యోగాల్లేక నిరుద్యోగ సమస్య పెరిగిపోయిందని, దీనిపై ఇప్పటికే ప్రభుత్వం చర్యలు చేపట్టిందని నిరుద్యోగులకు త్వరలో ఆదుకుంటామన్నారు. ఈ సందర్భంగా సమస్యలకు సంబంధించిన అధికారులతో మాట్లాడి సమస్యలు పరిష్కరించాలని అధికారులకు సూచించారు. గ్రామాల్లో సమస్యలు ఉంటే విడతల వారీగా పరిష్కరిస్తానని కార్యకర్తలకు సూచించారు. ఇక నుంచి తాను ఉదయం పూట కార్యకర్తలు, ప్రజలు సమస్యలు వినతులు తీసుకుంటానని, రెండో పూట గ్రామాల్లో పర్యటించి గ్రామ పరిస్థితులను తెలుసుకొని పరిష్కరిస్తానన్నారు.

మంత్రిని కలిసిన యాదవులు

మంత్రి అచ్చెన్నాయుడును యాదవ సంఘం జిల్లా నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి ఘనంగా సన్మానించారు. యాదవ సంఘానికి ప్రభుత్వపరంగా సంక్షేమ పథకాలను అందేలా చూడాలని కోరారు. కార్యక్రమంలో యాదవ సంఘం నాయకులు ఇప్పిలి జగదీశ్, కలగ జగదీష్, ఎల్.కామేష్, జానకిరామ్, అంబటి కృష్ణమూర్తి, సప్ప నవీన్ దడియాల తదితరులు పాల్గొన్నారు.



ప్రజా దర్బార్‌లో వినతులు స్వీకరిస్తున్న మంత్రి అచ్చెన్నాయుడు



ధర్నా చేస్తున్న నాయకులు

విద్యుత్ ఛార్జీల పెంపుపై ఆందోళన

హిరమండలం: రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్ ఛార్జీల పెంపు, సర్దుబాటు ఛార్జీల వసూలు రద్దు చేయాలని ఏపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు సిర్ల ప్రసాద్ ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. ప్రసాద్ ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. ఈ మేరకు విద్యుత్ కార్యాలయం ఎదుట సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దళితులకు, గిరిజనులకు ఉచితంగా ఉచిత విద్యుత్ సరఫరా చేస్తామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. ఇప్పుడు గత నాలుగేళ్ల క్రితం నుంచి బకాయిపడిన విద్యుత్ ఛార్జీలను వసూలు చేయడం సరికాదన్నారు. 200 యూనిట్లు వరకు సబ్సిడీ ఇచ్చిన ప్రభుత్వాలు విద్యుత్ ఛార్జీల బకాయిలు చెల్లించాలని ఒత్తిడి తేవడం, మీటర్లు తొలగిస్తామని బెదిరించడం మానుకోవాలని సూచించారు. లేకుంటే విద్యుత్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్.అసిరయ్య, సురేష్, కృష్ణ లక్ష్మి చిన్నమ్మి పాల్గొన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

మౌలిక సదుపాయాలు కల్పించాలని వినతి

ప్రజాశక్తి- పలాస

పలాసలో బిసి, ఎస్‌టి వసతిగృహాల సమస్యలను పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి బి.హరీష్, ఉపాధ్యక్షులు సిహెచ్.రాజు కోరారు. ఈ మేరకు తహశీల్దార్ కళ్యాణ్ చక్రవర్తి, ఎంపిడిఒ వసంతకుమార్‌లను సోమవారం వినతిపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు ప్రశాంత వాతావరణంలో విద్యాభ్యాసం చేయాలంటే వసతిగృహాలు కీలకమని అన్నారు. అందులో భాగంగా పలాస బిసి మహిళా వసతిగృహంలో తాగునీటి సదుపాయం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఎస్‌టి బాలుర వసతిగృహంలో 130 మంది విద్యార్థులు ఉన్నారని, వారందరికీ కేవలం మూడు మరుగుదొడ్లే ఉన్నాయని అన్నారు. దీంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. కళాశాలకు ఆలస్యంగా వెళ్లాల్సి ఉంటుందని వాపోయారు. వెంటనే స్పందించిన ఎంపిడిఒ వసతిగృహాలను తనిఖీ చేశారు. సమస్యలన్నింటినీ తమ దృష్టికి తీసుకొచ్చినందుకు ఎస్ఎఫ్ఐ నాయకులను అభినందించారు. త్వరలో సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

బ్యాంకు ఖాతాకు ఎన్‌పిసిఐ తప్పనిసరి

ఆమదాలవలస : బ్యాంకు ఖాతాదారులందరూ ఎన్‌పిసిఐ తప్పనిసరిగా లింకు చేసుకోవాలని పురపాలక సంఘ కమిషనర్ పూజారి బాలాజీ ప్రసాద్ ఒక ప్రకటనలో కోరారు. 18 ఏళ్లుదాటి బ్యాంక్ అకౌంట్ కలిగిన ప్రతి వ్యక్తి బ్యాంకుకు వెళ్లి ఎన్‌పిసిఐ యాక్టివ్ (లింక్) చేయించుకోవాలని సూచించారు. ప్రభుత్వ పథకాలు, ఇతర ప్రభుత్వ సంబంధమైన లావాదేవీలు లబ్ధిదారుల ఖాతాల్లో జమ కావాలంటే తప్పనిసరిగా ఈ లింకును చేయించుకోవాలని సూచించారు.

లావేరు పాఠశాల మైదానంలో అక్రమ నిర్మాణం

చోద్యం చూస్తున్న విద్యాశాఖాధికారులు



లావేరు జెడ్‌పి పాఠశాల



పాఠశాల ప్రాంగణంలో ఆలయ నిర్మాణానికి తీసిన గోతులు

ప్రజాశక్తి- లావేరు

మండల కేంద్రం లావేరు జెడ్‌పి పాఠశాల క్రీడామైదానంలో అక్రమంగా నిర్మాణాలు చేస్తున్నా విద్యాశాఖాధికారులు చోద్యం చూస్తున్నారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు సమీపంలోని ఉన్న వస్త్రపురి కాలనీకి చెందిన కొంతమంది పెద్దలు, యువత కలిసి ఇటీవల పాఠశాల క్రీడా మైదానంలో ప్రహరీ గోడ లోపల ఆలయం పేరు చెబుతూ ప్రభుత్వం నుంచి ఎటువంటి అనుమతులు లేకుండా ఈ నెల 21న లావేరు మాజీ ఉప సర్పంచ్ నల్ల కామరాజు కుమారుడు వాసు దంపతుల చేతులమీదగా ఆలయ నిర్మాణానికి కొంతమంది గ్రామస్తులు, యువత సమక్షంలో అట్టహాసంగా భూమిపూజ కార్యక్రమం చేపట్టారు. ఇటీవల ప్రభుత్వం పాఠశాల ప్రాంగణంలో ఎటువంటి రాజకీయ సమావేశాలు, ప్రైవేట్ ఫంక్షన్లు, విందు కార్యక్రమాలు నిర్వహించరాదని, చట్టవ్యతిరేక కార్యక్రమాలు నిర్వహిస్తే కేసులు నమోదు చేస్తామని, అరెస్టు చేసి కఠినచర్యలు తీసుకోవడం జరుగుతుందని చెప్పినప్పటికీ ఇక్కడ ఇవేమీ పట్టకుండా ఒకవైపు తరగతి గదులు, మరోవైపు క్రీడామైదానం, ఇంకో పక్కన విద్యార్థులు, బాలబాలికలు, మహిళా ఉపాధ్యాయులు, సిబ్బంది ఉపయోగించే మరుగుదొడ్లను ఆనుకుని ఆలయం పేరుతో నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అనంతరం మెటీరియల్ వేసి చట్టవిరుద్ధంగా అక్రమ నిర్మాణం చేపడుతున్నా విద్యాశాఖాధికారులు, రెవెన్యూ అధికారులు పట్టించుకోకుండా చోద్యం చూస్తున్నారు. పాఠశాల ఆవరణలో ప్రభుత్వ అనుమతులు లేకుండా కట్టడాలు కడితే భవిష్యత్‌లో పాఠశాలకు క్రీడామైదానం లేకపోతే విద్యార్థుల పరిస్థితి ఏమిటని పలువురు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, జిల్లా విద్యాశాఖ అధికారులు స్పందించాలని, పాఠశాల ఆవరణలో అక్రమ నిర్మాణాలను నిలుపుదల చేయాలని, అక్రమ నిర్మాణదారులపై కఠిన చర్యలు తీసుకోవాలని, భవిష్యత్ తరాలకు క్రీడామైదానం అన్యాక్రాంతం కాకుండా చూడాలని విద్యార్థుల తల్లిదండ్రులు, క్రీడాకారులు, పలు గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

ధర్నాను జయప్రదం చేయాలి

ప్రజాశక్తి- గార

కేంద్ర ప్రభుత్వ రైతు, కార్మిక వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా 26న జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద జరుగనున్న ధర్నాను జయప్రదం చేయాలని ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.మోహనరావు, జి.రామకృష్ణ పిలుపునిచ్చారు. సోమవారం గార, కళింగపట్నం, తాన్సాహెబ్ పేటలో ఇంటింటా పోస్టర్లు పంపిణీ చేసి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లడుతూ కేంద్ర ప్రభుత్వం రైతు, కార్మిక వ్యతరేక విధానాలను అమలు చేస్తున్నాయన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్పొరేట్లు, పెట్టుబడిదారులకు పన్నురాయితీ, ప్రోత్సాహాల పేరుతో ప్రజల ధనాన్ని దోచిపెట్టిందన్నారు. కార్మికులకు నెలకు ఇవ్వాల్సిన రూ.26 వేలు కనీస వేతనాన్ని ఇవ్వడంలేదన్నారు. సుప్రీంకోర్టు చెప్పినా స్కీం కార్మికులు అంగన్వాడీ, ఆశా, మధ్యాహ్న భోజన కార్మికులను కార్మికులుగా గుర్తించడం లేదన్నారు. కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ కార్మికులను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు.



పోస్టర్లు పంపిణీ చేస్తున్న రైతుసంఘం నాయకులు

బాగున్న సిసి రోడ్డుపై మళ్లీ రోడ్డు



గతంలో ఉన్న సిసి రోడ్డు



కొత్తగా వేసిన సిసి రోడ్డు

ప్రజాశక్తి- ఎచ్చెర్ల

ఎపి మహిళా సహకార ఆర్థిక సంస్థకు వెళ్లే సిసి రోడ్డు బాగానే ఉన్నా మరలా దానిపై సిసి రోడ్డు వేయడంతో మండలంలో పెద్దఎత్తున దుమారం రేగుతోంది. ఈ సంస్థలో గడిచిన ఐదేళ్లలో ఒక్క శిక్షణ కూడా లేకపోయినా, రోడ్డు అంత అవసరం లేకపోయినా అధికారులు మాత్రం ఆఘమేఘాల మీద రోడ్డు వేయడంపై ప్రజలు పలు సందేహాలు వ్యక్తం చేస్తున్నారు. వాస్తవంగా ఈ ప్రాంగణానికి వెళ్లే రహదారి బాగానే ఉండగా, వీధిదీపాలు వేయాలని గతంలో సంస్థ సిబ్బంది పలుమార్లు అధికారులను కోరారు. మండల పరిషత్ కార్యాలయ ఉద్యోగి బంధువు ఈ సిసి రోడ్డు వేయడంతో అధికారులు ఒకే రోడ్డును రెండు పనులుగా విభజించడం, బాగున్న రోడ్డుపై మరలా రోడ్డు వేయటంతో పెద్దఎత్తున నిధులు దుర్వినియోగం అయ్యాయని విమర్శలు వస్తున్నాయి. ఈ విషయమై పంచాయతీరాజ్ శాఖ ఎఇ డి.సూర్యచంద్రను ప్రజాశక్తి వివరణ కోరగా మండల స్థాయి తీర్మానాలు ఇవ్వడంతో తాము ఈ రోడ్డు వేశామని, పనులు కూడా పూర్తయ్యాయన్నారు.

నిందితులను శిక్షించాలి

ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి హరీష్

ప్రజాశక్తి- పలాస

విశాఖపట్నంలో న్యాయ విద్యార్థికి న్యాయం చేసి నిందితులను కఠినంగా శిక్షించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి బి.హరీష్ డిమాండ్ చేశారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల నుంచి జీడి పిక్క కూడలి వరకు సోమవారం విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. జీడి పప్పు జంక్షన్ వద్ద ఘటనను నిరసిస్తూ మానవహారం చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మహిళాభివృద్ధికి చేసిన వాగ్దానాలు వాస్తవాల్లోకి రావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. దాని నిదర్శనమే మహిళలపై జరుగు వరుస అత్యాచారాలని అన్నారు. ఇటీవల కాలంలోనే జిల్లాలో జరుగు అత్యాచారాలు కేవలం పత్రికా ప్రకటనకే నాయకులు స్పందిస్తున్నారని అన్నారు. కానీ, బాధితులకు న్యాయం చేయడంతో చిత్తశుద్ధి లేదని విమర్శించారు. ప్రభుత్వాలు మహిళలకు రక్షణ కల్పించేందుకు కొత్త చట్టాలను ఏర్పాటు చేయాలని, ఇంకొకసారి ఎవరైనా మహిళలపై అత్యాచారం చేయాలన్న ఆలోచన కూడా రాకూడదనేట్టుగా శిక్షణను కఠినంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు సిహెచ్.రాజు, నాయకులు జయరాం, రమేష్ తదితరులు పాల్గొన్నారు.



మానవహారం నిర్వహిస్తున్న విద్యార్థినులు

నిర్వాసితులపై కేసు కొట్టివేత

ప్రజాశక్తి- కొత్తూరు

వంశధార నిర్వాసితులపై ప్రభుత్వం పెట్టిన తప్పుడు కేసును సోమవారం స్థానిక మెజిస్ట్రేట్ కోర్టు కొట్టివేసిందని నిర్వాసితుల సంఘం రాష్ట్ర కార్యదర్శి గంగరాపు సింహాచలం సోమవారం తెలిపారు. వంశధార నిర్వాసితులకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి రావాల్సిన పునరావాస ప్యాకేజీ కోసం 2015లో ఇరపాడులో సమావేశం నిర్వహించామన్నారు. ఈ సమావేశం 144 సెక్షన్ ఉల్లంఘనంటూ గంగరాజు సింహాచలం, బొంతల నారాయణరావు, మోజూరు అప్పడు, వాలిపల్లి సింహాచలం, అలికాన ఆనందరావులపై 2016లో పోలీసులు కేసు నమోదు చేశారని తెలిపారు. ఎనిమిదేళ్ల అనంతరం స్థానిక మెజిస్ట్రేట్ కోర్టు జడ్జి కేసు కొట్టివేసిందని న్యాయవాది ఎం.అప్పారావు తెలిపారని అన్నారు.



అభినందనలు తెలుపుతున్న ఎంఇఒలు

శ్రీనారాయణ విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి- రణస్థలం రూరల్

జాతీయ రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా నిర్వహించిన పోటీల్లో శ్రీ నారాయణ విద్యార్థులు రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యారు. జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యాన జిల్లా కేంద్రంలో ప్రభుత్వ బాలికల హైస్కూల్‌లో జిల్లా స్థాయిలో నిర్వహించిన డిబేటింగ్ పోటీల్లో పైడి తనుజ జిల్లా స్థాయిలో ప్రథమ స్థానం, వ్యాసరచన పోటీల్లో బొంగు జ్యోతిక జిల్లా స్థాయిలో ప్రథమ స్థానం సాధించారు. జిల్లాస్థాయిలో అద్భుత ప్రతిభ కనబర్చి రాష్ట్రస్థాయికి ఎంపికైన విద్యార్థులను మండల విద్యా శాఖ అధికారులు అజ్జాడ త్రినాథరావు, లావణ్య అభినందించారు. కార్యక్రమంలో మేనేజింగ్ డైరెక్టర్ కెల్ల మంజు భార్గవి, కరస్పాండెంట్ కె.గోవింద, ప్రిన్సిపాల్ గౌరినాయుడు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



భాస్కరరావును సన్మానిస్తున్న సంఘ నాయకులు

శిష్టకరణాల అభివృద్ధికి కృషి

నరసన్నపేట : శిష్టకరణాల అభివృద్ధికి కృషి చేస్తానని తరగతి పెద్ద, అకౌంటెంట్ బూరవెల్లి భాస్కరరావు అన్నారు. సంఘం జిల్లా అధ్యక్షులు సదాశివుని కృష్ణ అధ్యక్షతన స్థానిక ఎస్ఎల్‌విడి కళ్యాణ మండపంలో భాస్కరరావుకు సోమవారం దుశ్శాలువ కప్పి సన్మానించారు. కార్యక్రమంలో అంపలాం వసంతకుమార్, ఎంవిజె మోహనరావు, కష్ప ప్రసాదరావు, సదాశివుని సింహాచలం, ఉదంద్రావు, రమణబాబు, సదాశివుని ప్రభాకరావు పాల్గొన్నారు.

రేపు కృత్రిమ అవయవాల పంపిణీ

ఇచ్ఛాపురం: ఈ నెల 27న వెంకటేశ్వర పాఠశాలలో వికలాంగులకు ఉచిత కృత్రిమ అవవయాలను శ్రీ గురుదేవా ఛారిటబుల్ ట్రస్టు సౌజన్యంతో పంపిణీ చేస్తామని విహెచ్‌పిఎస్ ఆర్గనైజేషన్ జిల్లా వాలెంటర్ ఎం.భాస్కరరావు తెలిపారు. కాళ్లు, చేతులు, పోలియో విద్యార్థులకు ఉచితంగా పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. ఈనెల 27న పాఠశాల వద్ద రాయితీ పాస్ వికలాంగుల నుంచి వినికిడి యంత్రాలు తదితరమైన వాటికోసం దరఖాస్తులు స్వీకరించడం జరుగుతుందన్నారు. అదే విధంగా యుఐడి కార్డులు లేని వికలాంగుల పేర్లు నమోదు చేస్తామన్నారు. వికలాంగ విద్యార్థులు తమ ఆధార్ కార్డు, సదరన్ సర్టిఫికెట్, పాస్‌ఫొటోలు, ఫోన్ నంబర్లను తీసుకు రావాలని సూచించారు. పూర్తి వివరాలకు 9989371952ను సంప్రదించాలన్నారు.

త్వరితగతిన ఫిర్యాదుల పరిష్కారం

ఎస్‌పి కె.వి మహేశ్వర రెడ్డి



వినతులు స్వీకరిస్తున్న ఎస్‌పి మహేశ్వర రెడ్డి

ప్రజాశక్తి- శ్రీకాకుళం

ప్రజా ఫిర్యాదుల స్వీకరణ, పరిష్కారం కార్యక్రమంలో వచ్చే ఫిర్యాదులకు ప్రాధాన్యత ఇచ్చి జాప్యం లేకుండా త్వరితగతిన పరిష్కరించాలని ఎస్‌పి కె.వి. మహేశ్వర రెడ్డి పోలీసు అధికారులకు ఆదేశించారు. చట్ట పరిధిలో చర్యలు చేపట్టి బాధితులకు న్యాయం చేయాలన్నారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల నమోదు, పరిష్కార వేదికలో ఎస్‌పి ప్రజల నుంచి 60 వినతులు స్వీకరించారు. ఫిర్యాదుదారులతో ముఖాముఖి మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అర్జీలు, వారి వివరాలు సంబంధిత పోలీసు అధికారులకు జూమ్ కాన్ఫరెన్స్ ద్వారా సంబంధిత పోలీసు అధికారులకు తెలియజేసి చట్ట ప్రకారం చర్యలు తీసుకొని బాధితులకు న్యాయం చేయాలన్నారు. ఆయా ఫిర్యాదులపై తీసుకున్న చర్యలను నిర్ణీత సమయంలో జిల్లా పోలీస్ కార్యాలయానికి నివేదిక రూపంలో పంపించాలన్నారు.



శ్రీకాకుళం : ఉపాధ్యాయురాలిని సత్కరిస్తున్న సిబ్బంది

స్ఫూర్తి కోసమే రాజ్యాంగ దినోత్సవం

ప్రజాశక్తి- ఆమదాలవలస

రాజ్యాంగ దినోత్సవం నిర్వహించడం ద్వారా స్ఫూర్తిని పొందుతామని జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ బి.శ్యామసుందర్ అన్నారు. సోమవారం కళాశాల ఆవరణలో రాజ్యాంగ హక్కుల పరిరక్షణ వేదిక పోస్టర్లను ఆయన ఆవిష్కరించారు. వేదిక జిల్లా కన్వీనర్ బొడ్డేపల్లి మోహనరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. దేశవ్యాప్తంగా ఈనెల 26న జరుగుతున్న రాజ్యాంగ దినోత్సవాన్ని రాజకీయాలకు అతీతంగా అందరూ పాల్గొనాలని కోరారు. హక్కుల పరిరక్షణ కోసమే వేదికను ఏర్పాటు చేశామని, శ్రీకాకుళంలో మంగళవారం మధ్యాహ్నం మూడు గంటలకు ఏడురోడ్ల జంక్షన్ నుంచి అంబేద్కర్ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వేదిక గౌరవ సలహాదారు నల్లి ధర్మారావు, ఎపియూడబ్ల్యూజె రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎన్.ఈశ్వరరావు, కళాశాల లెక్చరర్లు జి.ధనంజయరావు, జి.తిరుపతిరావు, పి.సందీప్ కుమార్, కె.రాజారావు, జె రవిబాబు, బి.పుష్పలత, జి.సుజాత తదితరులు పాల్గొన్నారు.

శ్రీకాకుళం: స్థానిక బలగలోని అమర్ కౌముది స్కూల్‌లో రాజ్యాంగదినోత్సవ సందర్భంగా రాజ్యాంగ దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఇందులో భాగంగా క్విజ్, డిబేట్, వక్తృత్వ పోటీలు విద్యార్థులకు నిర్వహించారు. విద్యార్థులు తయారు చేసిన పార్లమెంట్ నమూనా, భారదేశ నమూనా, సహాయనిరకరణ ఉద్యమ చిహ్నమైన రాట్నం నమూనాలు చూపరులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ పొన్నాడ రమణమూర్తి తదితరులు పాల్గొన్నారు. అనంతరం సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయులను సత్కరించారు.

పని ఒకరు చేస్తే... బిల్లు మరొకరికి చెల్లింపు

మండల సమావేశంలో అధికారుల తీరుపై సభ్యుల ధ్వజం

పొందూరు: పని ఒకరు చేస్తే మరొకరికి బిల్లులు చెల్లింపులు చేపట్టిన అధికారుల తీరుపై మాజీ ఎంపిపి, కోటిపల్లి ఎంపిటిసి కూన ప్రమీల, టిడిపి సభ్యులు ధ్వజమెత్తారు. మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ఎంపిపి కిల్లి ఉషారాణి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని పెనుబర్తి పంచాయతీ అలమాజీపేటలో 2019లో టిడిపి ప్రభుత్వ హయాంలో పంచాయతీ తీర్మానంతో గ్రామానికి చెందిన టిడిపి నాయకులు బాడాన శేషగిరి రోడ్డు పనులు చేపట్టారని ఎంపిటిసి కూన ప్రమీల తెలిపారు. ఈ పనికి సంబంధించి అప్పట్లో మొదటి బిల్లుగా పంచాయతీ ఖాతాలో సుమారు రూ.4.50 లక్షలు జమైందన్నారు. ప్రభుత్వం మారిపోవడంతో బిల్లు చెల్లించకపోవడంతో కోర్టును ఆశ్రయించగా కోర్టు ఆదేశాలతో మొదటి బిల్లు చెల్లించారని, ఇదే పనికి రెండవ బిల్లు సుమారు రూ.3.30 లక్షలు పెండింగ్ ఉందని, వైసిపి ప్రభుత్వం వెండర్ కోడ్ పద్ధతిని తీసుకురాగా, 2022లో పంచాయతీ కార్యవర్గం మారిపోవడంతో రెండో బిల్లును నిలిపివేశారు. ఈ సమయంలో అధికారులు పనిచేసిన వారికి బిల్లు చెల్లించకుండా వెండర్‌కోడ్‌ను టి.మురళీకృష్ణ పేరుతో మార్చివేసి అప్పటి ఇంజనీరింగ్ అధికారులు, మండల అధికారులు ఎంబుక్ చేసి రెండవ బిల్లును పనిచేసిన బాడాన గిరికి ఇవ్వకుండా మురళీకృష్ణకు ఇచ్చారని ప్రశ్నించారు. దీనిపై తీర్మానం చేయాలని సభ్యులు పట్టుబట్టడంతో తీర్మానం చేస్తున్నట్లు ఎంపిడిఒ మన్మథరావు తెలిపారు. ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ గ్రామాల్లో ఇన్సూరెన్స్ అంటూ గ్యాస్ వినియోగదారుల నుంచి రూ.50 వసూలు చేస్తున్నారని, అలాగే గ్యాస్‌ను సకాలంలో సరఫరా చేయడం లేదంటూ పొందూరు ఎంపిటిసి-2 అనకాపల్లి వాణి తహశీల్దార్ వెంకటేష్ దృష్టికి తీసుకువచ్చారు. కింతలి పిహెచ్‌సి చుట్టూ పిచ్చిమొక్కలు పెరిగిపోవడం, గేటు లేకపోవడంతో అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారిందని సర్పంచ్ పైడి రాంప్రసాద్, ఎంపిటిసి కూటికుప్పల హనుమంతురావు అధికారులకు తెలిపారు. పిల్లలవలస జగన్న కాలనీలో ఒకరికి కేటాయించిన స్థలంలో మరొకరు ఇళ్లు నిర్మాణం చేపడుతున్నారంటూ సర్పంచ్ బుడుమూరు పోలినాయుడు సభ దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై సంబందిత ఏజెన్సీపై డిఎస్ఒకు ఫిర్యాదు చేసినట్లు ఆయన పేర్కొన్నారు. సర్పంచ్‌లు, ఎంపిటిసిలు, వివిధశాఖల అధికారులు పాల్గొన్నారు.



అధికారులను ప్రశ్నిస్తున్న మాజీ ఎంపిపి ప్రమీల



టెక్కలి రూరల్ : సభ్యత్వం అందజేస్తున్న శేషగిరి

విస్తృతంగా టిడిపి సభ్యత్వ నమోదు

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

మండలంలోని భగవానుపురం పంచాయతీలో టిడిపి మండల అధ్యక్షులు బగాది శేషగిరి అధ్యక్షతన సోమవారం పార్టీ సభ్యత్వ నమోదు చేశారు. ఈ సందర్భంగా టిడిపి మండల మహిళా అధ్యక్షులు మెండ దమయంతి మాట్లాడుతూ టిడిపి సభ్యత్వం తీసుకునేందుకు ఉత్సాహం చూపిస్తున్నారని అన్నారు. సభ్యత్వం తీసుకున్న వారికి రూ.5 లక్షల బీమా సౌకర్యం ఉంటుందన్నారు. కార్యక్రమంలో పొన్నాడ రాజారావు, మంచాల సింహాచలం, పంగ మన్మథరావు, పొన్నాడ రామారావు, పొన్నాడ అప్పలస్వామి, కార్యకర్తలు పాల్గొన్నారు.

వజ్రపుకొత్తూరు : మండలంలోని దేవునల్తాడ, కొత్తపేట గ్రామాల్లో టిడిపి నాయకులు సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో రాష్ట్ర అగ్నికుల క్షత్రియ డైరెక్టర్ పుచ్చ ఈశ్వరరావు, మండల టిడిపి ప్రధాన కార్యదర్శి కర్ని రమణ, గోవింద పాపారావు, బైనపల్లి నారాయణ, పెరిమల్ల సాయి పాల్గొన్నారు.



మీనాక్షి మృతదేహం
(ఇన్‌సెట్‌లో మీనాక్షి ఫైల్)

పెళ్లయిన ఆరు నెలలకే...

వరకట్నం వేధింపులతో వివాహిత ఆత్మహత్య

ప్రజాశక్తి- పలాస

అంతర్జాతీయ స్త్రీ హింస నిరోధక దినోత్సవం రోజున మండలంలోని ఈదురాపల్లిలో సోమవారం వివాహిత ఆత్మహత్యకు పాల్పడింది. వరకట్నం వేధింపులతోనే తన కుమార్తెను చంపేశారని తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. పోలీస్‌స్టేషన్‌కు పెద్ద సంఖ్యలో గ్రామస్తులు చేరుకొని నిరసన వ్యక్తం చేశారు. పెళ్లయిన ఆరు నెలలకే ఆత్మహత్యకు పాల్పడడంతో తల్లిదండ్రులు రోదిస్తున్నారు. పది రోజుల క్రితం ఇదే గ్రామానికి చెందిన శాసనపురి నవ్యతో ఇద్దరు వివాహితలు ఇదే గ్రామంలో ఆత్మహత్యకు పాల్పడడం కలకలం రేపుతోంది. స్థానికులు, మృతిరాలి తలిదండ్రులు, కాశీబుగ్గ పోలీసులు తెలిపిన వివరాలు ఉన్నాయి. మండలంలోని ఈదురాపల్లికి చెందిన పైల వినోద్ ఢిల్లీలోని ఆర్మీ ఉద్యోగిగా పనిచేస్తున్నారు. ఆయనకు నీరజాక్షి (19)తో ఆరు నెల క్రితం వివాహమై ఢిల్లీలోనే భార్యాభర్తలు ఉంటున్నారు. ఈ క్రమంలో వారం రోజుల క్రితం గ్రామంలో కార్తీక పౌర్ణమి వేడుకలు నిర్వహించుకోవడానికి ఇద్దరూ ఇంటికి వచ్చారు. సోమవారం భర్త వేరే గదిలో నిద్రిస్తుండగా... ఆమె ఇంటికొన్నానికి ఉరిపోసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. కొద్ది సమయం తరువాత చూడగా వేలాడుతూ కనిపించింది. వెంటనే కిందకు దించి చూడగా... అప్పటికే మృతి చెందింది. సమాచారం అందుకున్న సంఘటన స్థలానికి సిఐ టి.మోహనరావు చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. శవపంచనామా నిర్వహించి మృతదేహాన్ని పలాస ప్రభుత్వాస్పత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

భర్త, అత్తవారింటి వేధింపులతోనే...

మెళియాపుట్టి మండలం టకోయికి చెందిన పల్లి సంపతిరావు, ధనలక్ష్మికి ఇద్దరు సంతానంలో చిన్నకుమార్తె నీరజాక్షిని ఆరు నెల క్రితం ఈదురాపలికి చెందిన పైల వినోద్‌కు ఇచ్చి వివాహం చేశారు. ఆ సమయంలో రూ.పది లక్షల కట్నం ఇచ్చేందుకు ఒప్పుకున్నారు. అందులో రూ.ఐదు లక్షలు కట్నంతో పాటు బంగారం, ఇతర కానుకలు సమర్పించుకున్నారు. మిగిలిన రూ.ఐదు లక్షలు తీసుకురావాలని వినోద్ పాటు వారి తల్లిదండ్రులు డిమాండ్ చేస్తున్నట్లు నీరజాక్షి తల్లిదండ్రులు ఆరోపించారు. ఈ క్రమంలో సోమవారం మధ్యాహ్నం 2 గంటల సమయంలో మీ కుమార్తె ఉరిపోసుకొని ఆత్మహత్యకు పాల్పడిందని తమకు ఫోన్ చేశారని, ఇంటికి వెళ్లి మృతదేహాన్ని పరిశీలించగా తమకు అనేక అనుమానాలు ఉన్నాయని తెలిపారు. కట్నం వ్యవహారంతోనే తన కుమార్తె మృతి చెందిందని, తమకు న్యాయం చేయాలని వారు డిమాండ్ చేసారు. సంఘటన స్థలానికి చేరుకున్న టకోయి గ్రామస్తులు కూడా పెద్ద సంఖ్యలో చేరుకొని మతురాలి కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

క్రైమ్ కార్నర్



మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు
(ఇన్‌సెట్‌లో సాయికుమార్ ఫైల్)

యువకుడు బలవన్మరణం

ప్రజాశక్తి- కొత్తూరు

మండలంలోని నివగాంకు చెందిన వాడ సాయికుమార్ (23) జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వెనుక ఉన్న చెట్టుకు ఆదివారం రాత్రి తాళ్లతో ఉరేసుకొని బలవన్మరణానికి పాల్పడ్డాడు. పోలీసులు వివరాలు ఉన్నాయి. మృతుడు ట్యాక్సీ డ్రైవర్‌గా పనిచేస్తున్నారు. రాత్రి 7 గంటల సమయంలో ఇంటికి వచ్చి తల్లి రోహిణికి బయటికి వెళ్తున్నానని చెప్పి వెళ్లిపోయాడు. కొద్ది సమయం తరువాత తల్లికి ఫోన్ చేసి నా మనసు బాగోలేదు... నేను చనిపోతున్నానని చెప్పి ఫోన్ స్విచ్ ఆఫ్ చేశాడు. వెంటనే అప్రమత్తమై స్థానికులతో చుట్టుపక్కల వాకబ్ చేశారు. రాత్రి కావడం ఆచూకీ లభించలేదు. సోమవారం ఉదయం చెట్టుకు వేలాడుతున్న శవాన్ని చూశారు. వెంటనే పోలీసులకు సమాచారం అందజేశారు. పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని శవపంచనామా నిర్వహించి పాతపట్నం ప్రభుత్వాస్పత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. మృతుడు మూడు నెలల కిందట ఒడిశా రాష్ట్రం హడ్డుబంగికి చెందిన వివాహిత మహిళతో అక్రమ సంబంధం పెట్టుకొని పరారయ్యాడు. ఆ తర్వాత తిరిగి ఆమెతో వచ్చేశాడు. ఆమె తన భర్తతో వెళ్లిపోయింది. దీనిపై అప్పట్లో పోలీస్‌స్టేషన్‌లో అదృశ్యం కేసు నమోదైంది. పోలీసులు ఇద్దరినీ పిలిచిపించి కౌన్సెలింగ్ నిర్వహించారు. అక్కడి నుంచి మనస్తాపానికి గురై ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడికి తల్లిదండ్రులు రోహిని, రామారావు, చెల్లి ఉన్నారు. ఎస్ఐ అమీర్ ఆలీ కేసు దర్యాప్తు చేస్తున్నారు.



సోంపేట : సామగ్రిని స్వాధీనం చేసుకున్న పోలీసులు

బెల్లం ఊటలు ధ్వంసం

మెళియాపుట్టి : మండలంలో సవరకొత్తూరులో టెక్కలి, కోటబొమ్మాళి నరసన్నపేట ఎక్సైజ్ సిబ్బంది నాటుసారా ఊటలపై సోమవారం విస్తృతంగా దాడులు చేశారు. ఈ దాడుల్లో అప్పోజిపేటలో 500 పులిసిన బెల్లం ఊటలను ధ్వంసం చేసినట్లు టెక్కలి ఎక్సైజ్ శాఖ సిఐ మీరాసాహెబ్ తెలిపారు. సవర మద్రిపాడుకు చెందిన ఒక వ్యక్తి వద్ద నుంచి 10 లీటర్ల నాటు సారాను స్వాధీనం చేసి అరెస్టు చేసినట్లు తెలిపారు. ఎక్కడైనా నాటుసారా తయారు చేస్తున్నట్లు తెలిస్తే సమాచారం అందించాలని కోరారు. ఎక్సైజ్ ఎస్ఐలు, సత్యనారాయణమూర్తి, గురుమూర్తి పాల్గొన్నారు.

టెక్కలి రూరల్: మండలంలోని సవరకొత్తురులో సోమవారం ఎక్సైజ్ అధికారులు దాడులు నిర్వహించారు. జిల్లా అధికారి సిహెచ్.తిరుపతి నాయుడు ఆదేశాల టెక్కలి ఎక్సైజ్ సిఐ ఎస్.కె.మీరా సాహెబ్ సోమవారం దాడులు చేసి 400 లీటర్ల బెల్లం ఊటలు, 10 లీటర్ల నాటుసారా ధ్వంసం చేశారు. కార్యక్రమంలో టెక్కలి, నరసన్నపేట ఎక్సైజ్ ఎస్ఐలు సత్యనారాయణమూర్తి, గురుమూర్తి పాల్గొన్నారు.

సోంపేట : మందస మండలం చాపరాయి పరిధిలో సోమవారం చేపట్టిన దాడుల్లో 1400 లీటర్ల బెల్లం ఊట ధ్వంసం చేసినట్లు ఎక్సైజ్ సిఐ బేబి తెలిపారు. నాటుసారా తయారీ, విక్రయాలపై కఠిన చర్యలు తీసుకుంటున్నామన్నారు.

మద్యం సీసాలతో ఇద్దరు అరెస్టు

పాతపట్నం : 12 మద్యం సీసాలతో ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేశామని ఎక్సైజ్ సిఐ కె.కృష్ణారావు తెలిపారు. మండలంలోని సింగిపురం వద్ద ఓ వ్యక్తి అక్రమంగా ఆరు మద్యం సీసాలతో పట్టుబడ్డారని అన్నారు. అలాగే పాతపట్నానికి చెందిన ఓ వ్యక్తి ఆరు మద్యం సీసాలు అక్రమంగా తరలిస్తుండగా పట్టుకున్నామని తెలిపారు. మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని ఇద్దరినీ అరెస్టు చేశామని తెలిపారు.

28 మద్యం సీసాలు పట్టివేత

'ప్రజాశక్తి' కథనానికి స్పందన

ప్రజాశక్తి- ఆమదాలవలస

మండలంలోని రామచంద్రపురం గ్రామ పంచాయతీ పరిధిలోని పొన్నాంపేటలో అక్రమంగా నిల్వ ఉంచిన 28 మద్యం క్వార్టర్ బాటిళ్లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ కె.వెంకటేష్ తెలిపారు. సోమవారం 'ప్రజాశక్తి' పత్రికలో వచ్చిన కథనానికి స్పందించిన పోలీసులు బెల్ట్ షాపుపై దాడి చేసి సిబ్బందితో తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో అక్రమంగా నిల్వ ఉంచిన మద్యం సీసాలను గుర్తించి స్వాధీనం చేసుకొని వ్యక్తిని అరెస్ట్ చేసినట్లు తెలిపారు.

ఆలయాల్లో చోరీ

ప్రజాశక్తి- సరుబుజ్జిలి

మండలంలోని పురుషోత్తపురంలో ఉన్న మందలమ్మ తల్లి, సంతోషిమాత ఆలయాల్లో ఆదివారం అర్ధరాత్రి దొంగలు చొరబడ్డారు. మందలమ్మ తల్లి ఆలయంలో ఉన్న బీరువా, హుండీ, సిసి కెమేరాలను పగులగొట్టి కొంత నగదు, అమ్మవారికి భక్తులు సమర్పించిన మంగళ సూత్రాలను దొంగలు దోచుకుపోయారు. అలాగే సంతోషిమాత ఆలయంలో కూడా కొంత నగదు చోరీకి గురైనట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు.

వరుస దొంగతనాలతో ప్రజల బెంబేలు

మండలంలో వరుసగా జరుగుతున్న దొంగతనాలతో ప్రజలు బెంబేలెత్తుతున్నారు. గతంలో కూడా పురుషోత్తపురంలో ఉమా కామేశ్వర స్వామి, త్రినాథస్వామి ఆలయాలతో పాటు రావివలస, రొట్టవలస గ్రామాల్లోని ఆలయాల్లో పలు దొంగతనాలు జరిగాయి. వరుస ఘటనలతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. పోలీసు యంత్రాంగం రాత్రి గస్తీని ముమ్మరం చేయాలని మండల ప్రజలు కోరుతున్నారు.



ఆలయంలో పగులగొట్టిన బీరువాలు

మహిళలను గౌరవిద్దాం


పొందూరు : ప్రచారంలో పాల్గొన్న ఎంపిటిసిలు


కవిటి : మానవహారం నిర్వహిస్తున్న మహిళా సమాఖ్య సభ్యులు


పోలాకి : ర్యాలీని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రమణమూర్తి



లావేరు : ర్యాలీ నిర్వహిస్తున్న మహిళా సంఘాల సభ్యులు

ప్రజాశక్తి- పోలాకి

మహిళలపై గౌరవం కలిగి ఉండాలని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. పోలాకిలో పేదరిక నిర్మూలన సంస్థ (వెలుగు) ఎపిఎం జి.రాజారావు అధ్యక్షతన అంతర్జాతీయ స్త్రీ హింస నిరోధక దినోత్సవం సందర్భంగా స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల నుంచి తహశీల్దార్ కార్యాలయం వరకు సోమవారం ర్యాలీ నిర్వహించారు. అనంతరం మానవహారం చేపట్టారు. మహిళలకు ఇవ్వాల్సిన ప్రాధాన్యత, రక్షణ తదితర అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు ఎం.వెంకట అప్పలనాయుడు, సర్పంచ్ మజ్జి రమణమ్మ, లుకలాపు రాంబాబు, భైరి భాస్కరరావు, ఎంపిడిఒ జి.రవికుమార్, సూపరింటెండెంట్ సూర్యప్రకాష్, ఎసి కొండలరావు, ఎపిఒ రమణారావు పాల్గొన్నారు.

కవిటి: తల్లిదండ్రులు ఆడ, మగ అనే లింగ బేధాలు చూపించకుండా, మహిళలు, బాలికలను అన్ని రంగాల్లో ప్రోత్సహించాలని ఎపిఎం గోవిందరావు సూచించారు. అంతర్జాతీయ స్త్రీ హింస వ్యతిరేక దినోత్సవం సందర్భంగా మహిళా సమాఖ్య ఆధ్వర్యాన కవిటిలో ర్యాలీ నిర్వహించి మానవహారం చేపట్టారు. అనంతరం రక్తహీనత నివారిద్దామని, బాలికలను చదివిద్దామని, స్త్రీ హింసను వ్యతిరేకిద్దామని నినాదాలు చేశారు.

పలాస: బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని, బాల్య వివాహాలను నివారించాలని ఎంపిడిఒ వసంత కుమార్ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో అంతర్జాతీయ స్త్రీ హింస నిరోధ దినోత్సవం సందర్భంగా ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో పంచాయతీ విస్తీర్ణాధికారి మెట్ట వైకుంఠరావు, ఎంఎంఎస్ అధ్యక్షులు గండుబారికి శాంతమ్మ, వెలుగు ఎపిఎం జాంబవతి, ఉపాధి హామీ ఎపిఒ శంకరరావు, ఎఫ్‌పిఒ ఎపిఎం జి.అప్పలనర్సమ్మ, కళ్యాణి, తేజేశ్వరరావు పాల్గొన్నారు.

మెళియాపుట్టి : మహిళలపై హింసకు పాల్పడితే చర్యలు తీసుకుంటామని ఎంపిడిఒ నరసింహ ప్రసాద్ పండా, ఎపిఎం త్రినాథమ్మ అన్నారు. అంతర్జాతీయ స్త్రీ హింస నిరోధక దినోత్సవం సందర్భంగా వెలుగు కార్యాలయం నుంచి మూడు రోడ్ల కూడలి వరకు ర్యాలీ నిర్వహించారు.

వజ్రపుకొత్తూరు : అంతర్జాతీయ స్త్రీ హింస నిరోధక దినోత్సవం సందర్భంగా ఎపిఎం గొడబ ప్రసాదరావు ఆధ్వర్యాన మహిళలు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సిసిలు రేణుక, హరిప్రియ, వెంకటరావు, విఒఎలు పాల్గొన్నారు.

కంచిలి : బాలికల, మహిళల సంరక్షణకు అందరం కలిసి నడుద్దాం అంటూ కంచిలి మండల మహిళా సమైక్య సభ్యులు పిలుపునిచ్చారు. అంతర్జాతీయ స్త్రీ హింస నిరోధక దినోత్సవం సందర్భంగా కంచిలిలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎపిఎం ప్రసాదరావు, మహిళా సమాఖ్య సభ్యులు పాల్గొన్నారు.

సోంపేట: అంతర్జాతీయ స్త్రీ హింస నిరోధక దినోత్సవం సందర్భంగా మండల మహిళా సమైక్య ఆధ్వర్యాన సోంపేటలో ర్యాలీ, మానవహారం చేపట్టారు. కార్యక్రమంలో ఎపిఎం రవనమ్మ, ఎపిఒ ప్రమీల, ఇఒపిఆర్‌డి వెంకటేశ్వరరావు, తహశీల్దార్ అప్పలస్వామి పాల్గొన్నారు.

నందిగాం : అంతర్జాతీయ స్త్రీ హింస నిరోధక దినోత్సవం సందర్భంగా మండల మహిళా సమాఖ్య ఆధ్వర్యాన నందిగాంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపిడిఒ టి.రాజారావు, ఎపిఒ మనోరత్నం, కార్యదర్శి రమణబాబు, ఎంఎంఎస్ ఉపాధ్యక్షులు సరోజనమ్మ, గణేష్, పద్మ, హైమ పాల్గొన్నారు.

పొందూరు: మహిళలపై జరుగుతున్న హింసాత్మక దాడులను అరికట్టేందుకు ప్రతిఒక్కరూ కలిసికట్టుగా పోరాడాలని ఎంపిపి కిల్లి ఉషారాణి, మాజీ ఎంపిపి కూన ప్రమీల అన్నారు. మండల పరిషత్ కార్యాలయం ఆవరణంలో మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు పైడి అరుణ ఆధ్వర్యంలో సోమవారం జెండర్ ఆధారిత హింసకు వ్యతిరేకంగా జాతీయ ప్రచార కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలపై హింసకు వ్యతిరేకంగా కలిసికట్టుగా ఒకే స్వరం వినిపించాలన్నారు. దీనిపై మండల మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో గ్రామాల్లో నవంబర్ 25 నుంచి డిసెంబర్ 23 వరకు అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎపిఎం రామమూర్తి, ఎంపిటిసిలు బాడాన హారిక, కాకర్ల చెల్లమాంబ, అన్నెపు కుమారి, అనకాపల్లి వాణి, కళ్యాణి, సిసిలు పాల్గొన్నారు.

లావేరు : మహిళా గృహహింస చట్టాలపై ప్రతిఒక్కరు అవగాహన కలిగి ఉండాలని తహశీల్దార్ ఎన్ని జోగారావు అన్నారు. మండల మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో జండర్ కార్యక్రమం నిర్వహించారు. బాల్య వివాహ రహిత భారతదేశం, బాల్య వివాహాలు, గృహహింస చట్టం తదితర చట్టాలపై ర్యాలీ, మానవహారం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపిడిఒ వెంకటరాజ్, ఎపిఎం బి.వి.సుబ్బయ్యనాయుడు, గ్రామ సంఘాల అధ్యక్షులు, సిసిలు, విఒఎలు పాల్గొన్నారు.


తంపర భూములపై విచారణ చేస్తున్న తహశీల్దార్ వెంకటరావు

తంపర భూముల వివాదంపై విచారణ

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

మండలం తీరప్రాంత తంపర భూముల వివాదంపై ఈదుపురం కండర కులస్తులు సిఎం ఫేసీలో ఇటీవల ఫిర్యాదు చేయడంతో స్థానిక రెవెన్యూ యంత్రాంగం విచారణ చేపట్టారు. సోమవారం తహశీల్దార్ వెంకటరావు రెవెన్యూ సిబ్బందితో దొంకూర్‌లో వివిధ తంపర భూములపై మత్స్యకారులు, గ్రామస్తులతో మాట్లాడారు. తంపర భూముల్లో దొంకూర్, బూర్జపాడు గ్రామస్తులు చేపల వేట కొనసాగింపు ఉంటే నష్టపోతున్నామని వారు తెలిపారు. పూర్తిస్థాయి విచారణ జరిపి నివేదికను ఉన్నతాధికారులకు పంపించడం జరుగుతుందని రెవెన్యూ అధికారులు తెలిపారు.


ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ వెంకటేష్

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి- ఆమదాలవలస

సైబర్ నేరాలపై ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ కె.వెంకటేష్ అన్నారు. సోమవారం పురపాలక సంఘంలోని ఒకటవ వార్డు పరిధిలోని పార్వతీశం పేటలో సంకల్పం పేరిట సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రుణాలు ఇప్పిస్తామని ఎవరైనా ఫోన్ చేసి వివరాలు అడిగితే అటువంటి వారికి ఎటువంటి వివరాలు చెప్పవద్దని సూచించారు. ఫోన్‌లో లాటరీ పేలిందని బహుమతులు వచ్చాయని సైబర్ నేరగాళ్లు పంపించే లింకులపై ఎట్టి పరిస్థితుల్లోనూ క్లిక్ చేయవద్దని సూచించారు. ఎవరైనా సైబర్ మోసాలకు గురైతే వెంటనే పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలన్నారు. గంజాయి విక్రయించే వారి వివరాలు తెలిస్తే వెంటనే పోలీసులకు తెలియజేయాలని కోరారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.


ఆందోళన చేస్తున్న ప్రజాసంఘాల నాయకులు

పచ్చటి భూముల్లో ఎయిర్‌పోర్టు వద్దు

ప్రజాశక్తి- మందస

పచ్చటి ఉద్దానం భూముల్లో ఎయిర్‌పోర్టును నిర్మించవద్దని ప్రజా సంఘాలు డిమాండ్ చేశాయి. మండలంలోని మందస, వజ్రపుకొత్తూరు మండలాల పరిధిలోని సముద్రతీర ప్రాంతాల్లోని 20 గ్రామాల్లో సోమవారం పర్యటించి ప్రజాందోళనకు తమ సంఘీభావాన్ని ప్రకటించారు. కార్యక్రమంలో ఎఐకెఎంఎస్ జిల్లా నాయకులు గొరకల బాలకృష్ణ, రాపాక మాధవరావు, పిఒడబ్ల్యు జిల్లా ప్రధాన కార్యదర్శి పోతనపల్లి కుసుమ, ఉపాధ్యక్షులు కుత్తుం హేమక్క, జానకమ్మ, పివైఎస్ జిల్లా నాయకులు సార జగన్, ఇఫ్టూ నాయకులు బర్ల గోపి, పోతనపల్లి మల్లేశ్వరావు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సూర్యనారాయణ

ఉత్తరాంధ్ర ప్రజలను మోసగించడమే...

ప్రజాశక్తి- కొత్తూరు

విశాఖపట్నం రుషికొండ నిర్మాణాలపై సిఎం చంద్రబాబు నాయుడు వ్యాఖ్యలు అర్థరహితమని పిఎసిఎస్ మాజీ అధ్యక్షులు చింతాడ సూర్యనారాయణ అన్నారు సోమవారం స్థానికలతో విలేకరులు మాట్లాడారు. రుషికొండలో నిర్మాణాలు చాలా దఢంగా నిర్మించారని, ఖరీదైన భవనాలు ఎందుకు పనికొస్తాయని సిఎం ఇటీవల అన్నారని అన్నారు. చంద్రబాబు నాయుడు తాత్కాలిక నిర్మాణం తప్ప... శాశ్వత నిర్మాణాలు ఎక్కడ నిర్మించారని ప్రశ్నించారు. కల్లబొల్లి మాటలతో ఉత్తరాంధ్ర ప్రజలను మోసం చేయడమేనన్నారు. రుషికొండ భవనాలు మాజీ సిఎం జగన్మోహన్‌రెడ్డి వాడుకోవడం లేదన్నారు. సమావేశంలో వైసిపి మండల బూత్ కన్వీనర్ గండివలస ఆనంద్, పారాపురం ఎంపిటిసి వనుము లక్ష్మీనారాయణ, శ్రీను పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రజిత్‌కుమార్ పాణి

లక్ష్యాల సాధనకు కృషి చేయాలి

ప్రజాశక్తి- పొందూరు

విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను ఏర్పర్చుకుని వాటిని సాధించేందుకు కృషి చేయాలని ఉపహార్ సంస్థ నేషనల్ డైరెక్టర్ డా.రజత్‌కుమార్ పాణి అన్నారు. మండలం లోలుగు ఉపహార్ స్వచ్ఛంద సంస్థలో సోమవారం కెరియర్ పాత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ఏయే కోర్సులు చేస్తే ఏ ఉద్యోగాలను సాధించవచ్చో తెలియజేశారు. కార్యక్రమంలో ఉపహార్ ఏరియా మేనేజర్ బి.ఎం.పాల్, కో-ఆర్డినేటర్ ఏసుదాసు, కమ్యూనిటీ ఫెసిలిటేటర్ ఎల్.అప్పారావు, సిబ్బంది మోహన్, ఉగాది, శ్రీను, స్వాతి పాల్గొన్నారు.

సచివాలయం సందర్శన

కొత్తూరు : మండలంలోని పారాపురం శ్మశానవాటికకు రహదారి నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయని ఎంపిడిఒ నీరజ తెలిపారు. ఈ మేరకు సచివాలయాన్ని తనిఖీ చేసి అనంతరం శ్మశానానికి వెళ్లే రోడ్డును పరిశీలించారు. సిబ్బంది సమయ పాలన పాటించాలన్నారు. ఎన్‌పిసిఐ అకౌంట్లు, ఇళ్ల నిర్మాణాల లబ్ధిదారుల మ్యాపింగ్ పనులు పూర్తి చేయాలని ఆదేశించారు.


సిబ్బందితో మాట్లాడుతున్న ఎంపిడిఒ నీరజ


వినతిపత్రం అందజేస్తున్న కార్యదర్శులు

పనిభారం తగ్గించాలి

పలాస : గ్రామ సచివాలయంలో సచివాలయ సిబ్బంది చేయాల్సిన సర్వేలు, మిగతా పనులు రుద్ద పనిభారం పెంచడం సరికాదని కార్యదర్శులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు మండల పరిషత్ కార్యాలయం ఎఒ అనురాధను సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్యదర్శులు తమ శాఖపరంగా చేయాల్సిన పంచాయతీరాజ్ పనులకు ఇబ్బంది కలిగిస్తున్నారని అన్నారు. పనిఒత్తిడి నుంచి దూరం చేయాలని కోరారు. వినతిపత్రం అందజేస్తున్న వారిలో కార్యదర్శులు లండ శ్రీధర్, సుధాకర్, మీనాకుమారి, రవి, సద్గుణబాబు పాల్గొన్నారు.


వినతిపత్రం అందిస్తున్న ఎమ్మెల్సీ రామారావు

నిధులు మంజూరు చేయాలని వినతి

ప్రజాశక్తి- కవిటి

మండలంలోని శిలగాం-కవిటి ఆర్అండ్‌బి రహదారికి నిధులు మంజూరు చేయాలని కలెక్టర్ స్వప్నికల్ దినకర్‌ను ఎమ్మెల్సీ నర్తు రామారావు కోరారు. ఈ మేరకు సోమవారం కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ శిలగాం - కవిటి రహదారి పూర్తిగా శిథిలావస్థకు చేరుతుందని, కనీసం ద్విచక్ర వాహనంపై వెళ్లేందుడా ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు. దీనిపై కలెక్టర్ సానుకూలంగా స్పందించి వీలైనంత తొందరగా నిధులు మంజూరు చేయాలని ఆయన కోరారు.

చింతామణి ఆలయం సందర్శన

కవిటి: ప్రభుత్వ విప్ బెందాళం అశోక్ సోమవారం కవిటి చింతామణి అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు ఆయనకు సాదర స్వాగతం పలికారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు చింతామణి అమ్మవారి చిత్రపటాన్ని ఎమ్మెల్యేకు బహుకరించి, దుశ్శాలువ కప్పి సన్మానించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

వీధి కుక్కలకు టీకాలు

ప్రజాశక్తి- ఆమదాలవలస

పురపాలక సంఘం పరిధిలోని వీధి కుక్కలకు రేబిస్ నివారణ టీకాలు వేస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ పి.బాలాజీ ప్రసాద్ తెలిపారు. పట్టణంలోని మోణింగి వారి వీధి, ఐ జె నాయుడు కాలనీ, పూజారిపేట తదితర ప్రాంతాల్లో సోమవారం పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో టీకాలు వేశారు. వీధి కుక్కలకు పిచ్చికుక్క వ్యాధి రాకుండా ముందస్తుగా (రేబీస్) వ్యాధి నివారణ టీకాలు ప్రారంభించి సుమారు 33 వీధి కుక్కలకు వ్యాక్సిన్ వేసినట్లు పశుసంవర్ధక శాఖ ఎడి ఆనందరావు తెలిపారు.

ఎపిఎస్‌టిఎ జిల్లా సహాధ్యక్షునిగా 'నెమలిపురి'

వజ్రపుకొత్తూరు: ఆంధ్రప్రదేశ్ స్కూల్ టీచర్స్ అసోసియేషన్ జిల్లా సహాధ్యక్షునిగా నెమలిపురి విష్ణుమూర్తి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ మేరకు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తమ్మినేని చందనరావు నుంచి సోమవారం ఉత్తర్వులు అందాయి. ఈయన మండలంలోని పల్లిసారధి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హిందీ సహాయకులుగా పనిచేస్తున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంలో చిత్తశుద్ధితో పనిచేస్తానన్నారు. ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణకు, విద్యాభివృద్ధికి కృషి చేస్తానని చెప్పారు. ఆయన ఎన్నికపై చిన్నబాబు, సప్పతి మల్లేసు, గోవిందరాజులు, ఎన్.సురేష్ హర్షం వ్యక్తం చేశారు.

ఎమ్మెల్యే పరామర్శ

ప్రజాశక్తి- పోలాకి

మండలంలోని మృతుల కుటుంబాలను ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి సోమవారం పరామర్శించారు. రహీమాన్‌పురంలో జనసేన నాయకులు మెట్ట వైకుంఠరావు తల్లి, బొద్దాంలో గడ్డెయ్య మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే పరామర్శించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు మిరియాపల్లి వెంకటప్పలనాయుడు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ భైరి భాస్కరరావు, మాజీ ఎంపిపి తమ్మినేని భూషణరావు, కరుకోల దుష్యంత్, పాలన ప్రసాదరావు, పూజారి సోమేశ్వరరావు పాల్గొన్నారు.

22న ప్రాణిగ్రాహి సంస్మరణ సభ

ప్రజాశక్తి- పలాస

మండలంలోని బొడ్డపాడులో వచ్చే నెల 22న సుబ్బారావు పాణిగ్రాహి 56వ స్మారక సభ నిర్వహిస్తున్నట్లు ప్రజా సంఘాల నాయకులు తెలిపారు. ఈ మేరకు సోమవారం పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆలయంలో అర్చకుడిగా జీవనం సాగించే పాణిగ్రాహీ విప్లవజ్వాలను శ్రీకాకుళంలో రగిలించటంలో ఆయన చేసిన కృషి ఎనలేనిదన్నారు. తన కవితాగానంతో, కలకత్తా ఖాళీ మాత.. రుచిమరిగేను మధుర మిఠాయి అంటూ అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఎన్నో పాటలు, కవితలు రాసి, పాడినారని అన్నారు. శ్రీకాకుళ గిరిజన సాయుధ పోరాటంలో కీలకపాత్ర పోషించారన్నారు. కార్యక్రమంలో ప్రజా కళామండలి రాష్ట్ర సహాయ కార్యదర్శి నీలకంఠం, జిల్లా కార్యదర్శి రాపాక చిరంజీవి, శ్రీకాంత్ కుమార్, ఉత్తరాంధ్ర ప్రజా సంస్థ జిల్లా నాయకులు కొండే సూరి, న్యూడెమోక్రసీ రైతు కూలీ కమిటీ నాయకులు బాలకృష్ణ, సారా జగన్, మాధవ్, పిఒడబ్ల్యు జిల్లా కార్యదర్శి పోతనపల్లి కుసుమ, ఉత్తరాంధ్ర మహిళా సంఘం కార్యదర్శి పోతనపల్లి నాగమణి పాల్గొన్నారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు


టెక్కలి రూరల్ : దర్శించుకుంటున్న విజిలెన్స్ ఎస్‌పి ప్రసాదరావు

శివాలయాలకు యాత్రికుల తాకిడి

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

మండలంలోని రావివలస ఎండల మల్లిఖార్జునస్వామి ఆలయానికి సోమవారం యాత్రికుల తాకిడి పెరిగింది. కార్తీకమాసం నాలుగో సోమవారం కావడంతో జిల్లా నలుమూలలు, ఒడిశా నుంచి యాత్రికులు వేకువ జాము నుంచే దర్శించుకున్నారు. రద్దీని దృష్టిలో ఉంచుకుని అధికారులు తగు చర్యలు తీసుకుని టిక్కెట్లు విక్రయించారు. వృద్ధులకు, వికలాంగులకు ప్రత్యేక క్యూలైన్ ఏర్పాటు చేశారు. కార్య నిర్వాహణాధికారి గురునాథరావు, సిఐ అంబటి విజయకుమార్ పరిశీలించారు. ఎల్.ఎల్. నాయుడు, బడే జగదీశ్వరరావు ఏర్పాట్లు పరిశీలించారు. గోపీనాథపురం, అంబేద్కర్, ఇందిరా గాంధీ కడళ్ల వద్ద ట్రాఫిక్ అంతరాయం ఏర్పడడంతో గంటల తరబడి వాహనాలు నిలిచిపోయాయి. విజిలెన్స్ ఎస్‌పి బర్ల ప్రసాదరావు దంపతులు ఎండల మల్లన్నను దర్శించుకున్నారు.

కోటబొమ్మాళి: స్థానిక ఉమామల్లేశ్వరస్వామి ఆలయానికి యాత్రికులు తరలివచ్చారు. ఆలయ కార్య నిర్వహణాధికారి వాకచర్ల రాధాకృష్ణ యాత్రికులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా తగు జాగ్రత్తలు తీసుకున్నారు. రొక్కం అచ్యుతరావుదొర నాలుగు వేల మందికి అన్నదానం ఏర్పాటు చేశారు.

విశాలాంధ్ర బుక్‌హౌస్ ప్రారంభం

ప్రజాశక్తి- మెళియాపుట్టి

పుస్తక పఠనంతో జ్ఞానాన్ని మరింతగా పెంపొందింపచేసుకోవచ్చునని ఎంపిడిఒ నరసింహ ప్రసాద్ పండా, ఎంఇఒ దేవేందరరావు, ఎస్ఐ రమేష్‌బాబు అన్నారు. మండల కేంద్రంలోని విశాలాంధ్ర బుక్ హౌస్ సంచార వాహనాన్ని సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విశాలాంధ్ర సంస్థ గ్రామీణ ప్రాంతాల్లో ఉండే వారికి సైతం అందుబాటులో ఉండే విధంగా అన్ని రకాల గ్రంథాలు, పోటీ పరీక్షలకు తగిన పుస్తకాలు ఉన్నాయన్నారు. కార్యక్రమంలో విశ్రాంత ఉపాధ్యాయులు బి.లక్ష్మీనారాయణ, వై.రాజ మోహన రావు, సత్యనారాయణ రథో, వెంకటరావు, కిరణ్, శ్రీను, ఎం.వి.దుర్యోధన, మురళి, చాణిక్య పాల్గొన్నారు.


పుస్తకాలను కొనుగోలు చేస్తున్న అధికారులు

రిజర్వేషన్ కౌంటర్ మూసివేత సరికాదు


వినతిపత్రం అందజేస్తున్న శ్రీనివాస్ రంగా రౌలో

కవిటి: సోంపేట రైల్వేస్టేషన్‌లో రెండోపూట రిజర్వేషన్ కౌంటర్ మూసివేత సరికాదని, చాలామంది రిజర్వేషన్ చేసుకున్న ప్రయాణికులు, స్థానికులు దీంతో ఇబ్బంది పడుతున్నారని రైల్వే జెడ్ఆర్‌యుసిసి సభ్యుడు శ్రీనివాస్ రంగా రౌలో అన్నారు. అలాగే జాడుపూడి రైల్వే స్టేషన్‌లో పలు రైళ్ళకు హాల్ట్ కల్పించాలని కోరారు. ఈ మేరకు ఖుర్దా రోడ్‌లో ఉన్న డిసిఎంకు వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రయాణికుల సౌకర్యార్థం తక్షణమే సోంపేట రైల్వేస్టేషన్‌లో రెండో పూట రిజర్వేషన్ కౌంటర్ తెరిచి ఉంచాలని కోరారు. ముఖ్యంగా ఎంతోమంది ప్రయాణికులకు అనుకూలమైన జాడుపూడి రైల్వేస్టేషన్‌లో పలు రైళ్ల హాల్ట్‌ల ఆవశ్యకత వివరించారు. కార్యక్రమంలో రైల్వే వినియోగదారుల కమిటీ సభ్యుడు టిల్లు తదితరులు పాల్గొన్నారు.

చేప పిల్లల పంపిణీ

ప్రజాశక్తి- మెళియాపుట్టి

పార్వతీపురం మన్యం జిల్లా సీతంపేట ఐటిడిఎ ఆధ్వర్యాన గిరిజనులకు వంద శాతం రాయితీపై చేప పిల్లలు పంపిణీ చేస్తున్నట్లు ఐటిడిఎ ఎఒ శ్రీకాంత్, ఎఫ్‌డిఒ ముసలి నాయుడు తెలిపారు. మండలంలోని ముకుందపురం, ఇళయపురం, గొట్టిపల్లి గ్రామ సచివాలయాల వద సోమవారం గిరిజనులకు చేప పిల్లలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గిరిజనులను ప్రభుత్వం అన్నివిధాలా ఆదుకుంటుందని అన్నారు. చేపల పెంపకం ద్వారా గిరిజన మత్స్యకారులకు జీవనోపాధి కల్పించాలనే ఉద్దేశంతో ఉచితంగా చేప పిల్లలు పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు సిద్ధిపాలెం గౌరేష్, పెద్ద బొంతు అప్పారావు, గొల్ల జనార్ధన్, సవర భాస్కరరావు, ఫిషరీస్ అసిస్టెంట్ సుదర్శన్, విఒఎ ఈశ్వరరావు పాల్గొన్నారు.


చేప పిల్లలను పంపిణీ చేస్తున్న ఎఒ శ్రీకాంత్

షణ్ముఖకు మూడు బహుమతులు

ప్రజాశక్తి- కోటబొమ్మాళి

యుటిఎఫ్ స్వర్ణోత్సవాలు సందర్భంగా ఉపాధ్యాయులకు జిల్లా సాంస్కృతిక పోటీలు ఇటీవల నిర్వహించారు. ఈ పోటీల్లో మండలం కొత్తపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ఆంగ్ల ఉపాధ్యాయులు షణ్ముఖ మూడు బహుమతులకు ఎంపికయ్యారు. ఈ మేరకు మందస మండలం హరిపురంలో నిర్వహించిన యుటిఎఫ్ స్వర్ణోత్సవాల్లో యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఎన్.వెంకటేశ్వరరావు సోమవారం బహుమతులను అందజేశారు. నాటికలు, అభ్యుదయ గీతాలు, మిమిక్రీ పోటీల్లో షణ్ముఖ మాస్టర్ గెలిపొందారు. ఒకే వ్యక్తి మూడు విభాగాల్లో గెలవటం, అతనికి కళలపై ఉన్న ఆసక్తిని తెలపడమేనని అన్నారు.

గ్రీవెన్స్‌కు 16 ఫిర్యాదులు

పలాస: పలాస-కాశీబుగ్గ పురపాలక సంఘం కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (గ్రీవెన్స్)కు 16 ఫిర్యాదులు అందాయని కమిషనర్ ఎన్.రామారావు తెలిపారు. కార్యక్రమంలో మరణ ధ్రువపత్రాల కోసం 9, టిడ్కో ఇళ్ల కోసం 4, రేషన్ కార్డులు, వితంతు పింఛను కోసం 3 దరఖాస్తులు వచ్చాయన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ టిడ్కో ఇళ్ల విషయంలో లబ్ధిదారులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. ఈ విషయం ప్రభుత్వ పరిశీలనలో ఉందన్నారు. వచ్చిన దరఖాస్తులను పరిశీలించి శాఖాపరంగా పరిష్కరిస్తానని తెలిపారు.

ఎపిఎస్‌టిఎ జిల్లా అధ్యక్షులుగా మల్లేష్

ఇచ్ఛాపురం : ఎపి స్కూల్ టీచర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షునిగా సప్పతి మల్లేష్ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తమ్మినేని చందనరావు తెలిపారు. ఈ మేరకు మల్లేష్ సోమవారం బాధ్యతలను స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థుల విద్యా ప్రమాణాలు పెంపొందించేందుకు, ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కారానికి, ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి కృషి చేస్తానని అన్నారు. ఉపాధ్యాయులు కె.పద్మనాభరెడ్డి, కె.చంద్రశేఖర్‌రెడ్డి, కె.సుహాశ్చండ, తేజేశ్వరరావు, బి.సంతోష్‌కుమర్ మల్లేష్‌కు అభినందించారు.



జైభీమ్ ఆకృతిలో కూర్చున్న విద్యార్థులు

జైభీమ్ ఆకృతిలో విద్యార్థులు

పాతపట్నం: మంగళవారం భారత రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా పాఠశాల సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయులు ఆధ్వర్యాన అంబేద్కర్‌ను స్మరిస్తూ... ఆదర్శ పాఠశాల విద్యార్థులు సోమవారం జైభీమ్ ఆకృతిలో కూర్చున్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రత్నకుమారి, వైస్ ప్రిన్సిపాల్ ప్రసాదరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


ఎన్నికైన నూతన కార్యవర్గ సభ్యులు

రెడ్డి సంఘ నూతన కార్యవర్గం ఎన్నిక

ఇచ్ఛాపురం : పట్టణంలోని స్వేచ్ఛావతి రెడ్డిల సంఘం నూతన కార్యవర్గాన్ని సోమవారం ఎన్నుకున్నారు. 23 మంది కార్యవర్గ సభ్యులతో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షునిగా దుర్గాసి పాపారావు, ఉపాధ్యక్షులు పరపటి కోటి, కార్యదర్శిగా బర్ల లక్ష్మణరావు, క్యాషియర్‌గా ఉప్పాడ చిన్నారెడ్డి, జాయింట్ సెక్రటరీగా దక్కత బాష నియమితులయ్యారు. నూతన కార్యవర్గానికి పాత కార్యవర్గం శుభాకాంక్షలు తెలిపారు.



దీక్షలో పాల్గొన్న తులసిగాం మహిళలు

దీక్షలకు మహిళల మద్దతు

ప్రజాశక్తి- కవిటి

తమ సమస్యల పరిష్కారానికి కవిటి బస్టాండ్‌లో బెంతు ఒరియాలు చేస్తున్న రిలేనిరాహార దీక్షలకు మేము సైతం మద్దతు ఇస్తాం అంటూ తులసిగాంకు చెందిన బెంతు ఒరియా మహిళలు ముందుకు వచ్చారు. 334వ రోజు దీక్షలో పాల్గొని తమ సంఘీభావం ప్రకటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ బిడ్డల భవిష్యత్‌కు, అనగారిన తరగతులకు చెందిన బెంతు ఒరియాల స్థితిగతులు మెరుగుపరిచేందుకు బెంతు ఒరియా యువకులు, ప్రతినిధులు చేస్తున్న పోరాటానికి తాము అండగా ఉంటామని చెప్పారు. ఇప్పటికైనా నాయకులు, అధికారులు స్పందించి తమకు న్యాయం చేయాలని కోరారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లించాలి

పాతపట్నం : విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ డబ్బులను తక్షణమే చెల్లించాలని మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. వైసిపి ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలు కూటమి ప్రభుత్వం ఒక్కొక్కటిగా వాటిని నిర్వీర్యం చేస్తుందని అన్నారు. వైసిపి హయాంలో పేదరిక నిర్మూలన, మహిళా సాధికారత దిశగా పాలన సాగిందన్నారు. నాడు-నేడు కింద ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలు రూపురేఖలు మాజీ సిఎం జగన్ మార్చారని అన్నారు. మధ్యాహ్న భోజన పథకం ద్వారా విద్యార్థులకు పౌష్టికాహారం అందించడంలో శ్రద్ధ చూపడం లేదన్నారు.

రోడ్డు పనులకు శంకుస్థాపన

సోంపేట : మండలంలోని పలాసపురంలో సిసి రోడ్ల నిర్మాణానికి జెడ్‌పిటిసి తడక యశోద, సర్పంచ్ తడక జోగారావు సోమవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉపాధి హామీ నిధులతో ఈ పనులు చేపడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపిటిసి పి.రమణమూర్తి, వార్డు మెంబరు కె.కోదండరావు, బి.సోనీ తదితరులు పాల్గొన్నారు.